క్లుప్తంగా

ఆస్పత్రికి చేరిన వైద్య పరికరాలు



వైద్య పరికరాలను చూపుతున్న వైద్యులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రికి అత్యాధునిక వైద్య పరికరాలు చేరుకున్నాయని వైద్యులు ఎస్.సునీత, పి.ప్రియాంక తెలిపారు. రూ.6 లక్షల విలువ చేసే (వైద్య పరీక్షలకు సంబంధించిన) పరికరాలు వచ్చాయన్నారు. వ్యాధి నిర్ధారణకు ఉపయోగపడే అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇకనుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే.. వంశధార నిర్వాసితులకు న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వంశధార నిర్వాసితులకు న్యాయం జరిగిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాతపట్నం ప్రజలు రుణపడి ఉంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి గురువారం హిరమండలంలో విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం తీర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంటింటికీ కుళాయి పథకాన్ని మంజూరుచేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంతోపాటు గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారన్నారు. త్వరలో హిరమండలానికి ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ మంజూరవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. పీఏసీఎస్ ఛైర్మన్ ఏవీ సురేష్, వంగపల్లి చిన్నారావు, వంజరాపు జ్యోతి, ఎందవ ప్రసాద్, ఉపసర్పంచ్ వెలమల బాలరాజు, సచివాలయాల కన్వీనర్లు మీసాల శంకరరావు, వారణాసి సింహాచలం, పెద్దిన బుల్లి, పాట్నూరు సింహాచలం, లుకలాపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలు పంపిణీ



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు, గ్రామస్తులు

బూర్జ: డొంకలపర్త పంచాయతీలో అయోధ్య శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అక్షతలు, జెండాలతో ర్యాలీ చేపట్టారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించనున్న కార్యక్రమాల గురించి వివరించారు. రామ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సుల రద్దీ



బస్సు ఎక్కేందుకు సిద్ధమవుతున్న ప్రయాణికులు

నరసన్నపేట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గత రెండు రోజులుగా కిటకిటలాడుతుంది. గురువారం మరింత రద్దీ నెలకొంది. విశాఖ, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సుల్లో రద్దీ అధికంగా కనిపిస్తోంది. గ్రామాలకు వచ్చినవారంతా సంక్రాంతి అనంతరం మళ్లీ పట్టణాల బాట పట్టారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

శ్రీకాకుళం కల్చరల్: కరోనా నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా నగర ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించాలని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు కోరారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి సామాజిక బాధ్యతగా పాతబస్టాండ్, పొట్టి శ్రీరాములు మార్కెట్ కూడలిలో మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా రహిత జిల్లాగా శ్రీకాకుళం ఉండాలనే ఉద్దేశంతో మాస్కులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సామాజిక సేవకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నవజీవనరావు, సంఘ సేవకుడు మంత్రి వేంకటస్వామి చేతుల మీదుగా 1600 మాస్కులు అందజేశారు. ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్, లయన్స్ క్లబ్ సెంట్రల్ ట్రెజరర్ శిల్లా మణికంఠ, చేయూత మేమున్నాం సంస్థ అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకట లక్ష్మీ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు హాటకేశం, పాడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులకు.. స్వచ్ఛమైన తాగునీరు



- రూ.61.38 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు
- మున్సిపాలిటీలోని శివారు ప్రాంతాల్లో 15 రక్షిత మంచి నీటి పథకాలు.
- మూడు ట్యాంకర్లతో తాగునీరు అందజేత
- వంశధార, నాగావళి నదుల నుంచి డైరెక్ట్ పైపులైన్ల ద్వారా ప్రతిరోజూ తాగునీరు సరఫరా



శివారు ప్రాంతమైన పార్వతీశ్వరునిపేటలో రక్షిత మంచినీటి పథకం



ఆమదాలవలస: మున్సిపాలిటిలోని 23 వార్డుల పరిధిలో 11,475 కుటుంబాలు, 49 వేలు మంది జనాభా నివసిస్తున్నారు. వీరికి అవసరమైన తాగునీరు (ఒక్కో మనిషికి రోజుకు 90 లీటర్ల చొప్పున) పూర్తిస్థాయిలో మున్సిపల్ అధికారులు అందిస్తున్నారు. శివారు ప్రాంతాలైన తిమ్మాపురం, జగ్గశాస్త్రులపేట, చొట్టవానిపేట, ఊసవానిపేట, గేదెలవానిపేట, చింతాడ, పంతులపేట, లక్ష్మిడిపేట, వెంకయ్యపేట, సొట్టవానిపేట తదితర ప్రాంతాల్లో 15 రక్షిత మంచినీటి పథకాల ద్వారా నిత్యం తాగునీరు అందుతోంది. పలు గ్రామాలు ఎత్తు ప్రాంతంలో ఉండటంతో తాగునీరు పైపు లైన్ల ద్వారా అందడం లేదని ప్రజల విన్నపం మేరకు నిత్యం మూడు ట్యాంకర్లతో తాగునీరు అందిస్తున్నారు. వంశధార, నాగావళి నదుల నుంచి డైరెక్టు పైపులైన్లతో ఆమదాలవలస మున్సిపాలిటీలో ప్రజలకు నిత్యం తాగునీరు అందజేస్తున్నారు.

తాగునీటి ఎద్దడికి చెక్..

ప్రతి ఏటా వేసవి ఎద్దడి లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఒక పైపులైన్ మొరాయిస్తే మరొక పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు, కొన్నిచోట్ల లీకులుగా ఉన్న పైపులైన్లను తొలగించేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు రూ.61.38 కోట్లు విడుదల చేసింది. పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా ప్రాజెక్టు పనులు నిర్వహిస్తుననట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ చెబుతున్నారు.

తాగునీరు అందుతోంది



గతంలో కంటే ప్రస్తుతం తాగునీరు పూర్తిస్థాయిలో అందుతోంది. మా గ్రామానికి ట్యాంకర్‌తో కూడా తాగునీరు తీసుకువస్తున్నారు. గ్రామంలో రెండు బోర్లు కూడా ఉన్నాయి. కొత్తగా వేస్తున్న పైపులైన్‌లు కూడా మా గ్రామం వద్దకు వచ్చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో మాకు తాగునీటి ఇబ్బందులే ఉండవు.

– **దండుపాటి రాజేశ్వరి**, గృహిణి, జగ్గశాస్త్రులపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ

పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తున్నాం



మున్సిపాలిటీలో ఉన్న అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం తాగునీరు అందడం లేదని మాకు ఎటువంటి ఫిర్యాదులు రావడం లేదు. నూతనంగా పైపులైన్ల నిర్మాణం కూడా చేపడుతున్నాం. ప్రస్తుతం తాగునీరు అందించడంలో ఎటువంటి ఆటంకాలు లేవు.

– **కె.అప్పలనాయుడు**, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

పాతపట్నం అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పీఏసీఎస్ ఛైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అన్నారు. కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో మండలానికి 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందన్నారు. మెట్టూరులో పీహెచ్‌సీని ప్రారంభించారన్నారు. కొత్తూరు సీహెచ్‌సీలో ఏడుగురు వైద్య నిపుణులను నియమించారన్నారు. రూ.పది కోట్లతో అదనపు భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండలంలో 26 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్లు, పాల సేకరణ కేంద్ర భవనాలు నిర్మించామన్నారు. అలికాం-బత్తిలి, వసప-మెట్టూరు, పొనుటూరు-రుగడ, కురిగాం-పొనుటూరు, మెట్టూరు-గొట్టిపల్లి, కడుము కూడలి నుంచి-కురిగాం రోడ్లులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు వీటితోపాటు అడ్డంగి, గొట్టిపల్లి, ఆల్తి, లబ్బ, ఓండ్రుజోల, కాకరగూడ, కారిగూడతోపాటు పలు గిరిజన గ్రామాలకు కోట్లాది రూపాయలతో రహదారుల నిర్మాణం చేసినట్లు చెప్పారు. సంక్రాంతికి ముందే మండలంలోని 27 ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.హరి, గార రాజులు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పంకజదాస్, పార్టీ సీనియర్ నాయకుడు అప్పలస్వామి పాల్గొన్నారు.

● ఆత్మీయ సమ్మేళనం



1991-92 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, అప్పటి గురువులు

ఆమదాలవలస రూరల్: దూసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో గురువారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు చెప్పారు.

● మేమున్నామని..



తోటి విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: అక్కులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిసి కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థుల కుటుంబాలకు గురువారం తమవంతు ఆర్థికసాయం అందజేశారు.

బొడ్లపాడు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి మరుకుర్తి నాగార్జున ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబానికి రూ.30 వేలు, జగ్గశాస్త్రులపేట గ్రామానికి చెందిన దండుపాటి రామకృష్ణ అనారోగ్యం బాధపడుతుండటంతో ఆ కుటుంబానికి రూ.10 వేలు, సంతకొత్తవలస గ్రామానికి చెందిన మన్నేన రామారావుకి ప్రమాదశాత్తు రెండు కాళ్లు దెబ్బతినడంతో ఆ కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు చింతాడ అప్పారావు, బెండి మన్మథరావు, గొర్లి ప్రసాదరావు, కొమ్మాన విశాలక్ష్మి, మంగరాజు పాపారావు, నంబూరు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తూరు: ప్రజాపిత బ్రహ్మ బాబా సమాజానికి ఇచ్చిన ఉపదేశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బ్రహ్మకుమారి పద్మ అక్క కోరారు. స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారి ఓం శాంతి ధ్యాన మందిరంలో గురువారం బ్రహ్మ బాబా 55వ అవ్యక్త దినాన్ని నిర్వహించారు. ఓం శాంతి 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య, కాశీబాబు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కుల గణనపై శిక్షణ

పొందూరు: కుల గణన సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ సీపాన హరిహరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. కులగణన ఎలా చేయాలి, ఆరోగ్య యాప్ డౌన్‌లోడ్‌ను ప్రజలతో ఎలా చేయించాలి, ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల ఎస్‌వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రాసెస్) ఎలా చేయాలి, ఆయుష్మాన్ భవ కార్డుల పంపిణీపై శిక్షణ ఇచ్చారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించండి

నరసన్నపేట: మండలంలో శుక్రవారం నుంచి కుల గణన జరగనుంది. గ్రామ వలంటీర్లు మీ ఇంటికే వచ్చి గణన చేస్తారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు కోరారు. ఈ మేరకు గురువరాం ఒక ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ప్రత్యేక యాప్ ప్రభుత్వం సిద్ధం చేసిందని, దాని ప్రకారం గణన సర్వే జరుగుతుందన్నారు. ఎటువంటి అపోహలకు పోకుండా అందరూ సహకరించాలని కోరారు. గ్రామ వలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బంది వస్తారన్నారు.

నేడు కొత్తవలసలో గడపగడపకు మన ప్రభుత్వం

ఆమదాలవలస రూరల్: తొగరాం గ్రామ సచివాలయం పరిధిలో గల కొత్తవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్పీకర్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు హాజరుకావాలన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కొత్తూరు: అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తూరు మండలం అంబేడ్కర్-పూలే వారసుల ఐక్యవేదిక అధ్యక్షుడు జర్జాన తిరుపతిరావు కోరారు. మండలంలోని మాతల కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడంతో గురువారం నివాళులర్పించారు. పేదల కోసం అంబేడ్కర్, పూలే చేసిన పోరాటాలను వివరించారు. ఐక్య వేదిక ఉపాధ్యక్షులు కె.నాగభూషణరావు, టి.భీష్మారావు, కార్యదర్శి టి.రవి, కోశాధికారి జి.నారాయణ, దళిత నాయకులు, మాతల కాలనీ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వారంతా వడ్డి కులస్తులు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యోగేశ్వరరావు



మాట్లాడుతున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: జిల్లాలో బెంతు ఒరియాలుగా చలామణి అవుతున్న వారంతా వడ్డి కులస్తులేనని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. కవిటి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారందరూ వడ్డి కులస్తులన్నారు. జిల్లాలో బెంతు ఒరియాలమని చెప్పుకుంటున్న గ్రామాల్లో అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన టీసీఆర్, టీఐ కమిటీ ప్రతినిధులు అనేక అంశాలపై అధ్యాయనం చేశారన్నారు. జిల్లాలో ఉన్నవారు బెంతు ఒరియాలు కారని ఆనాటి కమిటీ సభ్యులు తేల్చి చెప్పారన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ఉపాధ్యక్షుడు బెజ్జి కృష్ణారావు, కో ఆర్డినేటర్ జన్ని అనిరుద్రుడు, కొంకాడ మన్మథరావు, జన్ని నీలయ్య, జన్ని దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బూర్జ: ఓ.వి.పేటలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

సరుబుజ్జిలి: క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ అన్నారు. ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో (మండల స్థాయి) విజేతలైన క్రీడాకారులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో షీల్డ్‌లు, కిట్లు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, ఎంపీడీఓ పీవీ మురళీ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: షీల్డ్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

బూర్జ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. ఓ.వి.పేట జెడ్పీహెచ్‌ఎస్, కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వివిధ ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్‌లు, పాఠశాల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

బూర్జ: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు త్వరగా సిద్ధం చేయాలని ఏపీఎస్‌ఐఆర్డీ పీఆర్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికల పెసిలిటేటర్స్ నియామకం, జీపీడీపీ అమలు నివేదిక, సుస్థిర అభివృద్ధి, గ్రామ సభలు, ఆర్థిక వనరులు గుర్తించుట, నిధులు కేటాయింపు తదితర అంశాలపై యాప్‌లలో నమోదు చేయడంపై అవగాహన ఉండాలన్నారు. ఎంపీడీఓ ఎం.రవీంద్ర బాబు, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, డీటీఎం ఎస్.లోకనాథం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న ఆర్థిక సంవత్సరానికి ప్రతీ పంచాయతీ నుంచి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని, దీంట్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులు భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి కూర్మారావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జీపీడీపీ, బీపీడీపీ ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, ఈఓ కూర్మారావు, మిత్రో, అరుణ్ కుమార్‌లు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● **మెళియాపుట్టి:** ప్రతీ గ్రామపంచాయతీని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీఓ చంద్రకుమారి, విస్తరణ అధికారి తారకేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, పరిపాలనాధికారి తిరుపతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బూర్జ: మాట్లాడుతున్న ఏపీఎస్‌ఐఆర్డీ పీఆర్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

● **ఎల్.ఎన్.పేట:** గ్రామాభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల ప్రణాళికల తయారీపై సమావేశమయ్యారు. ఈఓపీఆర్డీ పద్మజ, వైకెపీ ఏపీఎం రవిరాజ్, ఎంఈఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

● **కొత్తూరు:** ప్రణాళికలతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సవర సావిత్రి, ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో గురువారం ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శిలకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పావని నిర్వహించారు.

ఈఓపీఆర్డీ కృష్ణారావు మాట్లాడుతూ పంచాయతీల్లో 52 రకాల అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఏఓ బసవ రాంబాబు పాల్గొన్నారు.

● **పొందూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర, శనివారాల్లో మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ సీపాన హరిహరరావు తెలిపారు. ఈ నెల 19న కింతలి, కనిమెట్ట, మొదలవలస, బొడ్డేపల్లి, అచ్చిపోలవలస, రాపాక, కొంచాడ, తోలాపి, దళ్లవలస, కోటిపల్లి, పిల్లలవలస, ధర్మపురం, కృష్ణాపురం, వీఆర్ గూడెం గ్రామాల సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు. 20న తాడివలస, గోకర్నపల్లి, గోరింట, పెనుబర్తి, లైదాం, తుంగపేట, దళ్లిపేట, లోలుగు, పొందూరు, తండ్యాం, మలకాం, బాణాం, బురిడికంచరాం, నందివాడ, కేశవదాసుపురం గ్రామాల సచివాలయ సిబ్బందికి, కార్యదర్శులకు శిక్షణ ఉంటుందని, విధిగా హాజరుకావాలని కోరారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ ఛైర్మన్ అర్జునుడు

పాతపట్నం: సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ ఛైర్మన్ కొండాల అర్జునుడు, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవ తీసుకుని అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం నేరుగా సీఎం జగన్‌కు విన్నవించారన్నారు. దీనిపై స్పందించిన సీఎం జగన్ తన ముఖ్య సలహాదారు ధనుంజెయరెడ్డితో మాట్లాడి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని కాగువాడ-రొమదల గ్రామాల మధ్య మహేంద్ర తనయ నదిపై రూ.6.95 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన కార్యదర్శి గోకవలస రాము, పార్టీ నాయకులు ప్రహ్లాద పుల్లాయ్, ఎస్.అర్జునరావు, సవిరిగాన శ్రీను, అమర ఉష, ఎం.సుగుణ, మాధవ్ పుల్లాయ్, కుమార్ రెడ్డి, ఉమ, తులసినాయుడు, కాంతారావు, గాంధీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.